కథా కౌముది

# అంత్యకాలమైంది

భరద్వాజ్ గొడవర్తి

మధ్యాహ్నం పావు తక్కువ రెండు కావొస్తోంది.

ఫోన్ మోగుతోంది.

‘‘చెప్పారా బావ?’’

‘‘బావ, విషయం తెలిసిందా?’’

‘‘ఏ విషయం?’’

‘‘తాతయ్య ఇక మనకి లేరు రా...’’

"స్టార్ట్ అవుతున్నా..."

‘‘నేను కారులో వెళ్తున్నా, నాతో వచ్చేయి...’’

‘‘అలాగే...’’

తాతయ్యకి తొంభై మూడు సంవత్సరాలు. గత కొంతకాలంగా ఆయన శరీరంతో యుద్ధం చేస్తున్నారు. ఈ రోజు గెలిచారు!

తాతయ్యంటే అభిమానం ఉంది కానీ చనువు లేదు, నేను ఒక సాధారణ మనవడిని.

నాన్న చెబితే, ఒకసారి ఫోన్ చేసి మాట్లాడటం;

ఆ మాట్లాడినప్పుడు కూడా ‘‘ఎలా వున్నారు?’’ అని మాత్రమే కనుకొన్ని పెట్టేయడం,

అమ్మ సైగ చేస్తే, కాళ్ళకి నమస్కరించడం,

ఎప్పుడైనా పండగలకి ఒకసారి వెళ్లడం,
ఏదైనా ఇంట్లో మంచి జరిగితే ముందు ఆయనతో పంచుకోవడం,
ఇంతవరకే పరిధి గీసుకొని ఉండే ఒక సాధారణమైన మనవడిని.

ఏ రోజు ఆయన కాళ్లు కూడా నొక్కి ఎరుగను,
ఏ నిమిషం ఏది ఆశించినది లేదు,
ఏ క్షణం అగౌరవపరచి ఎరుగను.

కారు నెమ్మదిగా ఊరు చేరుకుంది.
ఊరంతా చీకటి, వెన్నల కాంతికూడ లేదు.
ఒక చోట వెలుతురు ఉంది, అక్కడే తాతయ్యను ఉంచారు.

అందరం కారు దిగాము.
అప్పటిదాకా దారి పొడుగునా ఏదో ఒకటి మాట్లాడుకుంటూ వచ్చాము,
చాలా తేలికపాటి విషయాలు, నిత్య సంగతులు.

దగ్గరకి వెళ్లే కొద్దీ అందరిలోనూ నిశ్శబ్దం,
అందరి మధ్య నిశ్శబ్దం.
ఒక వ్యక్తి శాశ్వత నిశ్శబ్దం తాలూకు శబ్దం,
అక్కడి కొందరి శోకం, కొందరి గాంభీర్యం, కొందరి మౌనం.

**తాతయ్య** అంటే పండగ సెలవలకి వెళ్లే **ఊరు**,
తాతయ్య అంటే అల్లరి చేస్తే ‘‘**పిచ్చోడెక్కడో**’’ అని కసురుకునే **గాంభీర్యం**,
తాతయ్య అంటే **బాధ్యత**,
తాతయ్య అంటే **సాంప్రదాయం**,
తాతయ్య అంటే బుజం అవసరం లేని **గుండె నిబ్బరం**,
తాతయ్య అంటే **విలువలు**,
తాతయ్య అంటే తొలకరి జల్లులు కురిసినప్పుడు వచ్చే **మట్టి వాసన**,
తాతయ్య అంటే **మందార పువ్వు**.

తాతయ్య రోజు ఆ స్వామిని **మందారపూవులతో** పూజిస్తూ ఉంటారు,
తాతయ్య మందార చెట్టులో **ఐక్యం** అయ్యిపోయారు.

ఊపిరిని **శరీరం** బంధించింది.
రేపు ఆ శరీరం **అగ్గిలో** కాలిపోతుంది.
మరునాడు బూడిద **గోదావరిలో** కలిసిపోతుంది.
గోదావరి పాయలుగా విడిపోయి **చెట్టుకి** నీరవుతుంది.
ఒక **మందార** చెట్టు బ్రతికింది, బోలెడు **పూలను** కన్నది.
అందులో రోజుకి ఒకటి చొప్పున **రామయ్య పాదాల** చెంతన నిలిచాయి.
**పువ్వు** సంబరపడింది. ఊపిరి సువాసనగా వదిలింది.
ఆ సువాసన **రామయ్యకు** అందింది.

**ఇంతకీ అమ్మమ్మకి విషయం ఇంకా చెప్పలేదా?**
లేదు. రేపు పొద్దున్న అందరు వచ్చాక చెప్పాలి.

**అమ్మమ్మ** పేరు ప్రస్తావించినప్పుడు **మిథునం** పుస్తకంలో అప్పదాసు చెప్పిన ఈ మాటలు గుర్తుకు వస్తున్నాయి:
**‘‘సత్సంగత్వే నిస్సంగత్వం – నిస్సంగత్వే నిర్మోహత్వం’’**

**‘‘తాతయ్య–అమ్మమ్మ’’ అంటే**
బ్రతుకు బరువును తగ్గించే **దాంపత్యం**,
అరమరికలు, తెరమరకలు లేని **స్నేహం**,
బ్రతుకు వేగానికి దారి చూపే **నిదానత్వం**,
సాయంకాలం పెంకుటింటి వరండాలో బల్ల మీద పెట్టిన **రెండు** వేడి టీ గ్లాసులు,
కొంగున పేరంటపు సెనగలు, చేతిలో టార్చిలైట్, కట్టుకొని, పట్టుకొని నడిచే **నాలుగు** అడుగులు,
ఒక వయసొచ్చాక **టీపాయ్** మీద పక్కపక్కనే పెట్టిన రెండు **మందుల** డబ్బాలు,
వృద్ధాప్యపు స్వగతపు పేజీలో **రెండు జంట అక్షరాలు**.

ఒక అక్షరం **నక్షత్రంలో** కలిసిపోయింది.

మరో అక్షరం ఒంటరిగా ఆ **నక్షత్రాన్ని** చూస్తూ భూమిపై మిగిలిపోయింది.

మరునాడు పొద్దున్న అమ్మమ్మకి విషయం చెప్పారు.

అందరూ ''అమ్మమ్మ ఎలా తీసుకుంటుందా?'' అని భయపడుతున్నారు.

''తనని ఓదార్చడానికి ఎన్ని భుజాలు కావాలో...'' అని ఎదురుచూస్తున్నారు.

పెద్ద మనవడు – ''అమ్మమా, తాతయ్య స్వామిలో ఐక్యమైపోయారు...''

అమ్మమ్మ ఒక నిమిషం ఏమీ మాట్లాడలేదు.

తల మీద చెయ్యి పెట్టుకుంది. తల దించుకుంది.

ముక్కు మీద చెయ్యి పెట్టుకుంది.

ఏదో చెప్పే ప్రయత్నం. పెదవులు వణుకుతున్నాయి.

చెమర్చిన నవ్వుతో –

''అవునా? స్వామిలో ఐక్యమయ్యారా...'' అని

రెండు చేతులు జోడించి నమస్కరించుకుంది.

తనలోతానుగా ఏదో మాట్లాడుకుంటోంది. సముదాయించుకుంటోంది.

ఈలోగా అటుగా వెళ్తున్న ముని మనవళ్లను దగ్గరకు పిలిచి

''మీ పేరేంటి?'' అని అడిగింది.

''వాళ్ళ పేరు తెలీదా నీకు?'' అంది పెద్దమ్మ.

''వయసు మీద పడుతోంది కదా, మరపు సహజం...'' అంది అమ్మమ్మ.

ఈలోగా కార్యక్రమాలు మొదలయ్యాయి.

తాతయ్య దేహాన్ని ఉంచిన ప్రదేశానికి, అమ్మమ్మని అతి కష్టంమీద బయటకు తీసుకువచ్చి కూర్చోపెట్టారు.

అమ్మమ్మని కూర్చోపెట్టిన చోటుకి అడ్డుగా, ఒక పల్చటి పసుపుపచ్చ దారాల తెరలాగా ఉంది.

కార్యక్రమం జరుగుతున్నప్పుడు,

ఆ తెర మధ్యనుండి అమ్మమ్మ తాతయ్యని చూస్తోంది.

బహుశా వాళ్ళ జీలకర్ర—బెల్లం శుభ ముహూర్తం నాడు కూడా,
ఇలాంటి తెరకి ఇరువైపులా కూర్చుని ఉంటారు.

అమ్మమ్మ ఏదో ఆలోచిస్తూ,
కాలికి ఉన్న మెట్టెలని సరిచేసుకుంది.
బహుశా తాతయ్య తొడిగిన మెట్టెలు కాబోలు.

ఎందుకో...
అమ్మమ్మని చూస్తున్నప్పుడు అనిపించింది –
అరవై పై సంవత్సరాల బంధం అది.
మనం అనుకుంటే, లేదా ఆ దేవుడు అనుకుంటే
ఆ బంధం ముగిసిపోదు.
ఆ జంట అనుకోవాలి.
బహుశా అమ్మమ్మ ఇంకా అనుకొని ఉండదు.
అందుకే తన కంటినుండి ఒక నీటి చుక్క కూడా రాలలేదు.

**గొప్ప బంధాలకు దేహంతో సంబంధం లేదు. ముగింపు లేదు.**
గొప్ప బంధాలలో **ప్రయాణం** మాత్రమే ఉంటుంది.
ఒకోసారి ఆ ప్రయాణంలో ఇద్దరూ ఉంటారు.
ఒక్కోసారి **ఒక్కరే** ఉంటారు.
కానీ ప్రయాణం ఆగదు.

ఈలోగా కార్యక్రమంలో భాగంగా
ఒకసారి బియ్యం అమ్మమ్మ చేతికి ఇచ్చి
పైకి తాతయ్య ఉన్న చోటికి రావాలని పూజారి గారు చెప్పారు.

అక్క, అమ్మమ్మ దగ్గరకు వచ్చి –
''రాగలవా అమ్మమ్మ...?'' అంది.

''రాలేనే...

నడవలేను నేను...

అయినా **అంత్యకాలమైంది –**

కొందరు ముందు వెళ్తారు...

కొందరు తర్వాత వెళ్తారు...''

**పదమూడవ రోజు కార్యక్రమం జరుగుతోంది – పరమపదోత్సవం అంటారు.**

ఒక ఇంట్లో నిర్వహిస్తున్నారు.

ఆ ఇంటి పెరటిలో ఒక మందార చెట్టు ఉంది.

పిల్లవాడు ఆడుకుంటూ ఒక మందార పువ్వుని తీసుకున్నాడు.

పరిగెత్తుకుంటూ వచ్చి బయట కూర్చున్న అమ్మమ్మ చేతికి ఇచ్చాడు.

అమ్మమ్మ ఆ పువ్వుని దోసిళ్ళలో ఉంచుకుంది.

పైకి తలెత్తి చూసింది.

ఎదురుగా తాతయ్య ఫోటో ఉంది.

ఒక నీటి బిందువు రాలింది.

అక్కడికొచ్చిన వారు ఒక కీర్తన పాడుతున్నారు.

అందులోని ఆఖరి పదాలు:

**''అంతా రంగనాధుడే, అంతరంగ నాధుడే...''**

★★★

COMMENTS